సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

లంబోదరం విశాలాక్షమ్.. వందేహం గణనాయకమ్



నీలమ్మ వేపచెట్టు దేవస్థానం రోడ్డులో శ్రీ గణపతి నీలమాంబ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచముఖ గణపతి



నేరెళ్లకోనేరు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సింహాద్రి అప్పన్న రూపంలో గణనాథుడు

వినాయక చవితి ఉత్సవాలు నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల అట్టహాసంగా జరిగాయి. పిల్లలు, పెద్దలు చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. కొత్తబట్టలు, పిండివంటలతో ఇళ్లన్నీ పండగ శోభతో కోలాహలంగా మారాయి. వీధులన్నీ చవితి పందిళ్లతో కళకళలాడాయి. పార్వతీ తనయుని పూజలతో అన్ని ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి.

- వినాయక చవితి వేడుకలతో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ
- వీధివీధి వెలసిన మండపాలు
- వెలుగులు విరజిమ్మిన విద్యుద్దీప కాంతులు

దాబాగార్డెన్స్ : నగరంలోని వినాయక చవితి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. వినూత్నంగా వేసిన పందిళ్లు పలువుర్ని ఆకట్టుకుంటున్నాయి. కొన్నిచోట్ల గణనాథుడిని నిలిపిన రోజునే నిమజ్జనం చేశారు. బుధవారం నుంచి పలు విగ్రహాలు నిమజ్జనం చేయనున్నారు. నగర పరిధిలో జగదాంబ జంక్షన్, యల్లమ్మతోట, సూర్యాబాగ్, మహారాణిపేట, అంగటిదిబ్బ, దిబ్బలపాలెం, ప్రకాశరావుపేట, చాకలిపేట, సాలిపేట, అల్లిపురం, రెల్లివీధి, కోటవీధి, పాతనగరం, ప్రసాద్‌గార్డెన్స్, వెలంపేట, పూర్ణామార్కెట్, రామజోగిపేట తదితర ప్రాంతాల్లో నవరాత్రులు నిర్వహిస్తున్నారు. సూర్యాబాగ్, పోలీస్‌క్వార్టర్స్‌లో గల పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ (పాపా హోమ్) ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ ప్రాంగణంలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులు కమిటీ సహకారంతో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగదాంబ జంక్షన్ సమీపాన గల దేవరవీధిలో యూత్ కమిటీ బాటిల్స్‌తో ఏర్పాటు చేసిన వినాయక మండపం పలువుర్ని ఆకట్టుకుంటోంది.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన

సంపత్ వినాయగర్ దేవాలయంలో వినాయక చవితిని పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తొలిరోజు నాట్యపరిమళ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులచే నిర్వహించిన కూచిపూడి ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా దేవాలయ వ్యవస్థాపక సభ్యుడు టీఆర్ చోళన్ నాట్యగురువు లిపికారెడ్డిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీ రాజశేఖర్, అర్చకుడు పి. మోహన్‌స్వామి, సిబ్బంది ప్రసాద్, గోవింద్, వేదపండితులు పాల్గొన్నారు.



నాట్యగురువు లిపికారెడ్డిని సత్కరిస్తున్న టీఆర్ చోళన్ ఇతర అతిథులు

భక్తి శ్రద్ధలతో చవితి వేడుకలు..

అల్లిపురం : నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం రోడ్డులో శ్రీ గణపతి నీలమాంబ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచముఖ గణేశుని విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నేరెళ్లకోనేరు జంక్షన్‌లో రైజింగ్ గైస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింహాద్రి అప్పన్న రూపంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం చూడముచ్చటగా ఉంది. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గత 63 సంవత్సరాలుగా నిరంతరాయంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీన అన్నసమారాధన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



జగదాంబ జంక్షన్ దేవరవీధిలో బాటిల్స్‌తో ఏర్పాటు చేసిన వినాయక మండపం

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

21న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 21న సహస్ర తులసి పూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్, వైద్యులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెబాస్టియన్‌కాలనీ, బాబూకాలనీ, జోనల్ కార్యాలయాల్లో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ జన్మదిన వేడుకల్లో భాగంగా మంగళవారం సెయింట్ జోసెఫ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ బృందం, రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాలు జరిగాయి. ముందుగా కార్పొరేటర్ పూర్ణిమ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు నిత్యావసర సరకులు, బియ్యం, వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఉచిత కంటి పరీక్షలు, రక్తదాన శిబిరం నిర్వహించారు. యువత రక్తదానం చేయడానికి ముందుగా రావడం అభినందనీయమని బ్లడ్ బ్యాంకు వైద్యులు డాక్టర్ మహేష్ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, వేలంగిణీరావు, పాత్రపల్లి సునీల్, ఈశ్వరి, దేవి, అన్నపూర్ణ, జీవీఎంసీ యూసీడీ విభాగం సీవో సత్యవతి, ఆర్పీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్ర పటానికి క్షీరాభిషేకం



ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థినులు

సీతమ్మధార : మహిళా బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జన జాగరణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థినులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త విజయ్‌కుమార్ మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం యావత్ భారతీయ మహిళలు ఎదురు చూస్తున్నారని అన్నారు. ప్రధాని నాయకత్వంలో బిల్లు ఆమోదించినందుకు మహిళలందరూ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నారని అన్నారు. మహిళా బిల్లు ఆమోదంతో భారత్ మాతాకీ జై అనే నినాదం సాకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు, హరికృష్ణ, ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

సీతమ్మధార: గుట్టుగా పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి సీతమ్మధారలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్సు ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, రూ.34 వేల నగదు, ఆరు ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని ద్వారకా పోలీస్‌లకు అప్పగించగా వారు కేసు నమోదు చేశారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : నియోజకవర్గంలో పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. జీవీఎంసీ 30వ వార్డు కేజీహెచ్ వార్డుభాయ్ కాలనీలో పలు ఇళ్లల్లో సోమవారం కురిసిన వర్షానికి ఇసుక మేట వేసింది. పలు కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆకుల భూలోకమ్మ ఇంట్లో ఇసుక మేట వేయడంతో వంట సామాన్లతో పాటు ఇంటిలో నివాసానికి వీల్లేకుండా పరిస్థితులు మారాయి. భోజనానికి ఇబ్బంది లేకుండా ఎమ్మెల్యే వాసుపల్లి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే దేవుపల్లి సుజాతకు రూ.5 వేలు, రాజాన పుష్పలతకు రూ.2 వేలు, ఆకుల ప్రకాష్‌రావుకు రూ.2 వేలు తన సొంత నిధుల నుంచి ఎమ్మెల్యే అందజేశారు. అంతే కాకుండా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునతో మాట్లాడి నష్టపరిహారం చెల్లించాలని, భవిష్యత్‌లో ఇటువంటి పరిణామాలు జరగకుండా ఉండేలా రక్షణగోడ నిర్మించాలని కోరారు. జోనల్ కమిషనర్ శివప్రసాద్‌తో మాట్లాడి బాధిత కుటుంబాలకు జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లల్లో చేరిన ఇసుకను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, జేసీఎస్ ఇన్‌చార్జ్ కోన శంకర్, సత్యనారాయణ, దేవరాజు, వడ్డాది దిలీప్, దశమంతుల చిన్ని, కొరిబిల్లి ఆనంద్, రాము, సూరిబాబు, మీనా, కల్యాణి, జ్యోతి, రెవెన్యూ అధికారులు, పార్టీ కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటితో ఇక్కట్లు



సీబీఎం కాంపౌండ్ రోడ్డులో పొంగుతున్న మ్యాన్‌హోల్

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు టింపనీ స్కూల్ సమీపంలో మ్యాన్‌హోల్స్ పొంగి మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో స్థానికులు ముక్కులు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో వారానికి ఒకసారి మ్యాన్‌హోల్స్ పొంగుతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ జోన్-3 కార్యాలయానికి సమీపంలోనే మ్యాన్‌హోల్ లీక్ అయి మురుగు రోడ్డుపై ప్రవహిస్తున్నా యూజీడీ, శానిటరీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఎమ్మెల్యే వాసుపల్లికి సత్కారం



వాసుపల్లి గణేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న 35వ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి తదితరులు

జగదాంబ: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జీవీఎంసీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. మంగళవారం వార్డులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి డైనమిక్ ముఖ్యమంత్రి అన్నారు. ఆయన ప్రభుత్వంలో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవ చేసే భాగ్యం కలిగిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి మూడేళ్లు పూర్తయి నాలుగో సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా కార్యకర్తలు చేసిన సన్మానం ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో వాసుపల్లి గణేష్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని జగనన్నకు వాసుపల్లి గెలుపును బహుమతిగా ఇస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వార్డు కార్యకర్తలు, కన్వీనర్లు జి.మూర్తి, రంగాల రవికుమార్, పుష్ప, మళ్ల రమాదేవి, కె.గంగాధర్, విజయ్, గండిబోయిన రమణ, పి.వినోద్, సంతోష్‌కుమార్‌రెడ్డి, నగేష్, రాము, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు ఆశ్రయం



లక్ష్మిని నిరాశ్రయ వసతి గృహానికి తరలిస్తున్న ఏయూటీడీ మేనేజర్ జ్యోతిర్మయి

అల్లిపురం : మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న మహిళకు చికిత్స అందించి ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. టీఎస్‌ఆర్ కాంప్లెక్స్, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి తెలిపిన వివరాల ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన సిరిపురం హెచ్‌పీ పెట్రోలు బంకు ఎదురుగా గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వెనుక ఒక మహిళ ఉందని, ఆమెకు మతిస్థిమితం లేదని గుర్తించిన స్థానికులు సమాచారం అందజేశారు. దీంతో ఏయూటీడీ సిబ్బంది ఆమెను చినవాల్తేరు మానసిక చికిత్సాలయంలో చేర్పించారు. అక్కడ చికిత్స తర్వాత ఆమె ఆరోగ్యం కుదుటపడింది. వైద్యుల సూచన మేరకు ఏయూటీడీ సిబ్బంది మంగళవారం ఆమెకు టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని మహిళల నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజాదర్బార్‌కు విశేష ఆదరణ



లక్ష్మీ టాకీస్ ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ పుట్టిన రోజు సందర్భంగా అందరికీ స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఇళ్ల స్థలాలు, హామీపత్రాలు ఇచ్చినప్పటికీ ఇళ్లు రాని వారి కోసం ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి నిమిత్తం అధికారులతో మాట్లాడారు. పిల్లలకు ఫీజులు లేకుండా విద్యనందిస్తున్న ఎమ్మెల్యేకు పార్టీ కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. వార్డులో రహదారులు, కాలువల మరమ్మతులపై ప్రజలు వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి ఆలయం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బోని దేవా, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం : బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆరోపించారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో ఆర్.శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన విశాఖ జిల్లా సమితి సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో ఇండియా కూటమి ఏర్పాటుతో బీజేపీ నాయకత్వంలో వణుకు ప్రారంభం అయిందన్నారు. ఇండియా పేరును భారత్‌గా మార్చాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. దేశంలో నరేంద్రమోదీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడమే కూటమి ప్రధాన లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రేరేపితంతోనే రాష్ట్ర ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేసిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజుతో పాటు పలువురు జిల్లా కార్యవర్గ సమితి సభ్యులు పాల్గొన్నారు.

నాస్తిక సమాజం వెబ్‌సైట్ ఆవిష్కరణ

ఆరిలోవ: ద్రవిడ ఉద్యమ నిర్మాత పెరియార్ ఈవీ రామస్వామి 145వ జయంతి మంగళవారం ఆరిలోవలో నాస్తిక సమాజం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాస్తిక సమాజం వెబ్‌సైట్‌ను వ్యవస్థాపక అధ్యక్షుడు జయగోపాల్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామస్వామి ఆగ్నేయ ఆసియా సోక్రటీస్‌గా పేరు గాంచారన్నారు. భారత నాస్తిక సమాజం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. కమిటీ సభ్యులు మురళి, అజయ్, శ్యామల పాల్గొన్నారు.

తోపుడుబండ్ల తొలగింపు అన్యాయం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న తోపుడు బళ్ల కార్మికులు

సీతమ్మధార: పి.ఎం.పాలెం నుంచి జూపార్కు వరకు ఉన్న తోపుడు బండ్లను జూ అధికారులు తొలగించడం అన్యాయమని సీఐటీయూ కార్యదర్శి ఎ.సింహాచలం, పి.వెంకటరావు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్లుగా తోపుడు బండ్లు, చిన్నచిన్న బడ్డీలు పెట్టుకుని ఎంతో మంది బతుకుతున్నారని అన్నారు. ఇప్పుడు జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, అటవీశాఖ అధికారులు దాడులు చేసి తమ కుటుంబాలను రోడ్డుపాలు చేశాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తోపుడు బండ్ల కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. జాతీయ స్ట్రీట్ వెండర్స్ చట్టం ప్రకారం రోడ్డు పక్కన బతికే చిల్లర వర్తకులకు రక్షణ కల్పించాలని కోరారు. జూపార్కు రోడ్డులో ఉన్న తోపుడుబండ్లను తొలగిస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని సీఐటీయూ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎ. కిరణ్‌కుమార్, ఎస్.లక్ష్మణ్, ఎన్.ధనంజయరావు, పి.రమణ, తోపుడు బండ్ల కార్మికులు పాల్గొన్నారు.

ఆక్రమణలతో.. అవస్థలు

- పూర్ణామార్కెట్, స్ప్రింగ్‌రోడ్డులో అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్
- ట్రాఫిక్ పోలీసుల మాట వినని ఆక్రమణదారులు



స్ప్రింగ్‌రోడ్డు వద్ద అనధికార పార్కింగ్



పూర్ణామార్కెట్ వెనుక గేటు వద్ద..



జనతాబజార్ ప్రధాన రహదారి పక్కన స్క్రాప్ వాహనాలు

జగదాంబ : రహదారుల ఆక్రమణలతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్‌తో పాటు పరిసర ప్రాంతాలన్నీ ఆక్రమణలకు గురవుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే పూర్ణామార్కెట్‌కు ఈ సెగ ఎక్కువగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారినట్లు ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా మార్కెట్ దరి టూటౌన్ పరిధిలో ఉన్న స్ప్రింగ్ రోడ్డులో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ఆ దారి పూర్తిగా రాకపోకలకు వీలు కాని విధంగా మారిపోయిందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అయితే ఇక్కడే ఉన్న వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సమస్య రోజురోజుకు ఎక్కువ అవుతుందంటున్నారు. అలాగే పూర్ణామార్కెట్ వెనుక గేటు వద్ద కూడా ఇదే దుస్థితి నెలకొంది. అక్కడ మార్కెట్‌లోకి వెళ్లడానికి కూడా వీలు లేకుండా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. అలాగే అక్కడ దుకాణదారులు కూడా రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటుండడంతో అసలు అటుగా వెళ్లడానికి కూడా ఎవరూ సాహసం చేయడంలేదు. మరో పక్క పోర్టు, వన్‌టౌన్‌కు వెళ్లే ద్విచక్ర వాహన చోదకులు జనతాబజార్ వద్ద పెట్టిన స్క్రాప్ వాహనాల కారణంగా తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు పలుమార్లు స్క్రాప్ వాహనాలు తీయించినప్పటికీ వ్యాపారులు మళ్లీ వాహనాలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ఆక్రమణలు తొలగించాలని వినియోగదారులు కోరుతున్నారు.

తాపీ ధర్మారావు జయంతి వేడుకలు నేడు

ఏయూ క్యాంపస్: తాపీ ధర్మారావు జయంతి వేడుకలను ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఆర్ అంబేడ్కర్ అసెంబ్లీ హాల్లో బుధవారం నిర్వహించనున్నట్లు తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావు తెలిపారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగు, సంగీత నృత్య విభాగం, సమైక్య భారతి-విశాఖ రచయితల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు మాధ్యమాల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పత్రికా రంగంలో ముందుకు నడుస్తూ మరో వైపు సాహిత్యాన్ని నడిపించిన నవీన వైతాళికుడు ధర్మారావని కొనియాడారు. హేతువాదిగా, నాస్తికుడిగా పేరొందిన తాపీ ధర్మారావు జన్మదినాన్ని తెలుగు మాధ్యమాల దినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఆర్ట్స్-కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఐఏఎస్‌ఈ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, కామర్స్-మేనేజ్‌మెంట్ స్టడీస్ శాఖాధ్యక్షుడు ఆచార్య జాలాది రవి, సంగీత నృత్య విభాగాధిపతి ఆచార్య ఎస్.అనురాధ, తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం 7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో నృసింహ హోమం ఘనంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చి హోమగుండం వద్ద అధిష్టంపజేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆజలాలను భక్తులపై చల్లారు. దేవస్థానం తరఫున ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
✆ 7997958342, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వయో విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
✆ 7075989701
Office mail : sakshiadvtvsp@gmail.com